తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## యోగి వేమనకు ఘన నివాళి



చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త: యోగి వేమన జయంతి పురస్కరించు కొని గురువారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో యోగి వేమన చిత్రపటానికి కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్‌లు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగి వేమన పామరులకు సైతం అర్థమయ్యేలా పద్యాలు చెప్పి మెప్పించిన కవి అన్నారు. సమస్యలను భిన్న కోణాల్లో దర్శించి, ఆ దర్శన వైశిష్ట్యాన్ని తన పద్యాల్లో ప్రదర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీభాషా, కలెక్టరేట్ ఎఓ కులశేఖర్, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరిటెండెంట్లు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా ప్రదోష నందిసేవ

### -వెండి సింహవాహనంపై శివయ్య

శ్రీకాళహస్తి, జనవరి 19 ప్రభాతవార్త



పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ప్రదోష నంది సేవను కన్నులపండువగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లను సుందరంగా అలంకరించి ఉత్సవ మూర్తిని ప్రదోష వెండి నందివాహనంపై ఆశీనుల్ని చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పల్లకీలో బోయిలు మోసుకుంటూ వచ్చి ఆలయంలో ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలోని దక్షిణామూర్తి వద్ద ఉంచి హారతులిచ్చారు. హర..హర..మహాదేవ అన్న శివనామస్మరణలో మారుమ్రోగిపోయింది.

### 65 సచివాలయాల్లో

## రిజిస్ట్రేషన్ల నిర్వహణకు సర్వం సిద్ధం

### గ్రామాలకు చేరిన సాఫ్ట్‌వేర్ పరికరాలు : జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్



సచివాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లపై రిజిస్ట్రార్లతో సమీక్షిస్తున్న జెసి వెంకటేశ్వర్

చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:

జిల్లాలో భూముల రీ-సర్వే కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు డాక్యుమెంటేషన్, మ్యాప్, ఇతర కార్యక్రమాలు పూర్తి అయిన 65 గ్రామాల్లో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశామని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టే విషయంపై గురువారం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ కలెక్టరేట్‌లో జిల్లాలోని రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ జిల్లాలో రీ-సర్వేకు సంబంధించి 65 గ్రామాల ప్రక్రియ పూర్తి కావడంతో ఆన్‌లైన్ డేటాను రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అందించడం జరిగిందన్నారు. వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందన్నారు. పైలెట్ గ్రామాలుగా వున్న 2 గ్రామాలతో పాటు మరో 63 గ్రామాలు కలిపి మొత్తం 65 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో సచివాలయాల్లో చేపట్టనుండటంతో ప్రజలు సుదూర ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్ళకుండా గ్రామాల్లోని వారి భూముల రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకోవచ్చునన్నారు. ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయాలని భావించే వ్యక్తులు వారి వద్ద వున్న హక్కు పత్రాలను సంబంధిత గ్రామ సచివాలయాలకు తీసుకెళ్తే అందుకు సంబంధించిన ఏర్పాట్లు సచివాలయ సిబ్బంది చేపట్టి పూర్తి చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రతి ఒక్క డాక్యుమెంట్ అక్కడే సమర్పించాల్సి వుంటుందన్నారు. అలాగే ఎవరైనా తమ భూములకు సంబంధించిన ఇసి కావాలనుకొంటే సంబంధిత సచివాలయాల్లోనే తీసుకొనే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఇచ్చిన జాబితా మేరకు ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టడానికి డ్రాఫ్టింగ్ ఇతరాత్రా కార్యక్రమాలు సంబంధిత సచివాలయాల్లోనే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఒక్క రికార్డుల అప్రూవల్ మాత్రం చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంపై ఇప్పటికే సచివాలయ సిబ్బందికి పలు దఫాలు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

## వైద్యుల కోసం రోగుల నిరీక్షణ

### నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా గూడూరు ప్రభుత్వాసుపత్రి - ఆసుపత్రిలో కనిపించని సమయపాలన





వైద్యులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు, వైద్యుల కోసం పడిగాపులు కాస్తున్న రోగులు

·గూడూరు, జనవరి 19 ప్రభాతవార్త

గూడూరు ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యం కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు సమయానికి రారు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు వాపోతున్నారు. గూడూరు ప్రభుత్వ వైద్యశాలలో గురువారం రోగులు వైద్యుల కోసం నిరీక్షించారు. ఉదయం 9.40 గంటలైనా డాక్టర్లు రాకపోవడంతో రోగులు ఎదురు చూశారు. వైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. వైద్యులు సమయపాలన పాటించడం లేదు. డాక్టర్లు ఎప్పుడొస్తారో తెలియక రోగులు అత్యవసర సేవల కోసం వస్తే ఎవరూ లేక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించే దుస్థితి నెలకొందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాంతోపాటు రోగులు వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రికి వెళితే అక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు వాపోతున్నారు.

**పేదలకు అందని వైద్యం**

సర్కారు దవాఖానలో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. గూడూరు ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అత్యవసర పరిస్థితిలో ఇబ్బందులు తప్పడం లేదని రోగులు వాపోతున్నారు. పేరుకు మాత్రమే పెద్దాసుపత్రి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని చూస్తే మాత్రం సమస్యలు రాజ్యమేలుతున్నాయి. రోగాన్ని నయం చేసుకునేందుకు ఆసుపత్రికి వస్తే వైద్యులు దొరకని పరిస్థితి. పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామంటున్న ప్రభుత్వ ప్రకటనలు అమలుకావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా గూడూరు ప్రభుత్వాసుపత్రి యంత్రాంగం తీరులో మార్పు రావడంలేదు. దూరప్రాంత రోగుల బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందికి చికిత్స చేయాల్సిన అవసరం ఉంది.




గూడ్స్‌బండిపై తరలుతున్న జెసిబి యంత్రాలు

ఇదేంటీ.. రోడ్డుపై ఉండి పనిచేసే జెసిబి యంత్రాలు కూతబండి (గూడ్స్ రైలు) ఎక్కాయి అనుకుంటున్నారా.. ఇవన్నీ కొత్త జెసిబి వాహనాలు.. ఇవి తమిళనాడు రాష్ట్రం నుంచి ఉత్తర భారతదేశానికి రవాణా చేస్తున్నారు. గురువారం కుప్పం రైల్వేస్టేషన్‌లో ఓ రైలు బోగీపై ఇలా జెసిబి యంత్రాలు వందల సంఖ్యలో తరలిస్తుండడాన్ని 'ప్రభాతవార్త' క్లిక్‌మనిపించింది.

**కుప్పం, ప్రభాతవార్త**

## ధైర్యంగా ఉండి భద్రత విధులు నిర్వహించండి

### ఉన్నతాధికారులు

శ్రీహరికోట (తడ), జనవరి 19 ప్రభాతవార్త

శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ఇటీవల వరుస ఆత్మహత్యల తర్వాత గురువారం అక్కడ కొంత ప్రశాంత వాతావరణం ఏర్పడింది. ఉన్నతాధికారులు ఈ సంఘటనలపై స్పందించారు. వెయ్యిమందికి పైగా సిఐఎస్ఎఫ్ దళాలు పహారా కాస్తున్న షార్‌లో ముగ్గురు ఆత్మహత్యల తర్వాత వారికి ధైర్యం చెబుతూ ఉన్నతాధికారులు భరోసా ఇస్తున్నారు. సిఐఎస్ఎఫ్ కమాండెంట్ రేఖానంబియార్‌తో పాటు పలువురు అధికారులు సిఐఎస్ఎఫ్ దళాలతో మాట్లాడినట్లు తెలిసింది. విధి నిర్వహణలో ఎప్పటిలాగే ధైర్యంగా ఉండాలని, మృతిచెందిన ఎస్ఐ, జవాన్‌లు కేవలం కుటుంబ, వ్యక్తిగత కారణాల వల్లనే ఆత్మహత్యలకు పాల్పడినట్లు షార్‌లో చెప్తున్నారు. కుటుంబ కారణాలతో ఈ సంఘటనలు జరగడంతో ఈ ప్రభావం షార్ భద్రతపై ఎంతమాత్రం ఉండదని, రాకెట్ కేంద్రం ప్రాధాన్యత దృష్ట్యా మళ్లీ ఎప్పటిలాగే ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిస్తున్నారు. ఇటు ఇస్రో షార్ శాస్త్రవేత్తలు, ఉన్నతస్థాయి వర్గాలు కూడా ఈ సంఘటనల మీద దృష్టి పెట్టి భద్రత బలగాలను అప్రమత్తం చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. తిరుపతి జిల్లా పోలీసు అధికారులు స్థానిక పోలీసులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఈ కేసులను త్వరితగతిన కొలిక్కి తేవాలని పేర్కొన్నారు. ఆ దిశలో నాయుడుపేట సబ్ డివిజన్, సూళ్లూరుపేట సర్కిల్, శ్రీహరికోట పోలీసుస్టేషన్‌లలో పనిచేసే అధికారులు కూడా అప్రమత్తం అయ్యారు. ఇదిలావుంటే శ్రీహరికోట కేంద్రం ప్రాధాన్యత దృష్ట్యా అక్కడ సిబ్బంది సంఖ్యను పెంచాలని పలువురు కోరుతున్నారు. శ్రీహరికోటలో పనిచేయడానికి పోలీసు శాఖ సిబ్బంది ఎందుకు ఉత్సాహం చూపించడం లేదో తెలుసుకోవాల్సిన అవసరాన్ని కూడా గుర్తు చేస్తున్నారు.

## కానిస్టేబుల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



తిరుపతి క్రైం, జనవరి 19, ప్రభాతవార్త

ఈ నెల 22 జనవరి 2023 కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు జరుగు నేపథ్యంలో పరీక్ష కేంద్రాలు తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు సమయం కంటే గంట ముందు నుండి అభ్యర్థులు పరీ కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒక గుర్తింపు కార్డు, బ్లూకలర్ బాల్ పెన్నులు మాత్రమే తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ చర్యలతో పాటు సెక్షన్ 144 అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనరల్ ఎస్పి కులశేఖర్, డిఎస్పిలు సురేందర్ రెడ్డి, మురళీకృష్ణ, సిఐలు శివప్రసాద్ రెడ్డి, అబ్బన్న, ఎస్ఐలు, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించిన ఎస్పీ



చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:

ఈ నెల 22వ తేదీ జరగనున్న ఎస్‌సిటి కానిస్టేబుల్ నియామక ప్రిలిమినరీ రాత పరీక్షల పేపర్స్‌ను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి పరిశీలించారు. పోలీస్ కానిస్టేబుల్ నియామకాల కోసం నిర్వహించే రాత పరీక్షల ప్రశ్నాపత్రాలను భద్రపరచడానికి చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ రిశాంత్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్, పోలీసు అధికారులకు కొన్ని సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను పరిశీలించి ఈ సిసి కెమెరాలను చిత్తూరు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను అనుసంధానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, చిత్తూరు డిఎస్పీ శ్రీనివాసమూర్తి, వన్‌టౌన్ సిఐ నరసింహరాజు, ఎస్ఐ రమేష్‌బాబు, పివికెఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.ఆనందరెడ్డి, ఐటికోర్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది గృహప్రవేశాలకు సన్నద్ధం కావాలి

### స్పందన అర్జీల పరిష్కారం అర్థవంతంగా ఉండాలి - కలెక్టర్ వెంకట రమణారెడ్డి



తిరుపతిరూరల్, జనవరి19 ప్రభాతవార్త:

ఉగాది పర్వదినానికి లబ్దిదారులు గృహ ప్రవేశాలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ వెంకట రమణారెడ్డి లబ్ధిదారులను ఆదేశించారు. జిల్లాలో రీ సర్వే వేగవంతం చేయాలని, జాతీయ రహదారులకు భూ సేకరణ, గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యకార్యదర్శి గురువారం అమరావతి నుండి సంబందిత అధికారులతో వీడియో కాన్ఫరేన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి కలెక్టర్ వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. వీడియో కాన్ఫరేన్స్ అనంతరం కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న భూ హక్కు, భూ రక్ష రీసర్వేలో గ్రౌండ్ వ్యాలిడేషన్, డిఎల్ఆర్ పబ్లిష్ చేయడం హక్కు పత్రాలు అందజేయడం వంటివి ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. జాతీయ రహదారులు, ఏపి ఐఐసి కొరకు భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. స్పందన అర్జీలపై సకాలంలో స్పందించి బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా అర్థవంతమైన పరిష్కారం అర్జీలకు చూపాలన్నారు. రెవెన్యూ అంశాలు మరింత జాగ్రత్తగా పరిశీలన త్వరితగతిన అర్జీదారుని సంతృప్తి మేరకు పరిష్కరించాలని, ఈ అంశం సి.యం.ఓ స్థాయిలో సమీక్షిస్తున్నారన్నారు. వ్యవసాయశాఖకు సంబంధించి రబీ వరి పంటకు ఈ-క్రాపింగ్ పూర్తి చేయాలని, వరి ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరాల సంస్థ సన్నద్దం కావాలన్నారు. సూపర్ చెక్ అన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చిందని, తహశీల్దార్స్, ఆర్డీఓలు, అగ్రికల్చర్ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. నవరత్నాలు, పేదలందరికి ఇళ్ళు కార్యక్రమంలో భాగంగా ఉగాది నాటికి నిర్ధేశించిన విధంగా 24676 గృహ నిర్మాణాలు ప్రారంభం అయ్యేలా చూడాలన్నారు. ఇంటి నిర్మాణాలకు ఎస్ హెచ్ జి ల ద్వారా అదనపు ఋణం లబ్దిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కేటగిరి 3 లే అవుట్స్ లో త్రాగునీటి కుళాయిలు ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్స్, అంతర్గత రోడ్లు, స్వాగత ఆర్చ్స్ తదితర మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులను అన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని, ఇంకా ప్రారంభం కాని వాటిని సత్వరమే ప్రాంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డేగా జిల్లాలో అన్ని మండలాల్లో సంబంధిత అధికారులు లే ఔట్స్ సందర్శన. గృహ నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో శ్రీనివాసరావు, డిఎల్‌డిఓ సుశీలాదేవి, సిపిఓ అశోక్‌కుమార్, డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్, జిల్లా రీ సర్వే అధికారి జయరాజ్, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ సుహానా సోని, హౌసింగ్ ఇఇ చంద్రశేఖర్‌బాబు, మత్స్యశా ఖ అధికారి చాంద్ బాషా, పిడి ఎపి ఎం ఐపి సతీష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గురువుకు విశేషాభిషేకాలు : పరవశించిన భక్త జనం

శ్రీకాళహస్తి, జనవరి 19 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు ఆలయ ఉప ప్రదానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. గురువారం దక్షిణామూర్తి అభిషేకానికి ఆదరణ పెరుగుతుంది. స్థానిక భక్తులే కాకుండా తమిళనాడు నుంచి వచ్చే భక్తులు కూడా విశేషంగా వస్తున్నారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో కాలుమోపిన వారికి తెలియని అనుభూతి కల్గిస్తుంది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచుగడప నుంచి ప్రవేశిస్తూనే మొట్టమొదట దర్శనమిచ్చేది. గురుదక్షిణా మూర్తి. ఇక్కడ దక్షిణామూర్తి క్షేత్రపాలకుడుగా విరాలజిల్లుతున్నారు. ఈ ఆలయం వద్ద ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడి ఆలయాన్ని భక్తుల భాగస్వామ్యంతో బంగారుతాపటం జరిపించారు. అంతేకాక గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. హోమాలు నిర్వహించారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి, కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్, శ్రీనివాసరాజు, సురేష్ స్థానిక భక్తులు విశేష సంఖ్య హాజరైనారు. పూజలు, అభిషేకాలను ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న గురుదక్షిణామూర్తి ఉత్సవం దృశ్యం

### ముఖ హాజరుకోసం

## పరుగులు తీస్తున్న ఉద్యోగులు

### వెంటాడుతున్న నెట్‌వర్క్, సిగ్నల్ సమస్యలు
### ప్రభుత్వ ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు

ఓజిలి, జనవరి 19, ప్రభాతవార్త

ముఖ హాజరు కోసం ఓజిలి మండలంలోని ఉద్యోగులు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు నూతనంగా ప్రవేశపెట్టిన ముఖ హాజరు విధానం ప్రహసనంగా మారింది. సిబ్బంది సహనానికి పరీక్ష పెడుతోంది. రోజంతా యాప్‌తో కుస్తీ పడేలా చేస్తోంది. ఈ నెల 16 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ హాజరు తప్పనిసరి చేయాలని సర్కారు. ఆదేశాలు జారీ చేసింది. మండల కేంద్రంలో పనిచేస్తున్న వారికి, ఉపాధ్యాయులకు ఇప్పటికే ఈ విధానం అమలులో ఉంది. మంగళవారం నుంచి మిగిలిన అన్ని స్థాయిలో ఉద్యోగులకు తప్పనిసరి చేశారు. కాగా కనుమ సెలవు కావడంతో 17 నుంచి మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. అయితే నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో ఉద్యోగులు ఆపసోపాలు పడ్డారు. మండలం వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఓజిలి మండలంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద నెట్ వర్క్ సిగ్నల్స్ లేకపోవడంతో ముఖ హాజరుకు ఉద్యోగులు నానా అవస్థలు పడ్డారు. యాప్ డౌన్ లోడ్‌కు నెట్వర్క్ సిగ్నల్స్ ఉన్న ప్రాంతాల్లోకి పరుగులు పెట్టాల్సి వచ్చింది. దూరంగా వెళ్లి ముఖ హాజరులో నమోదు కాకుండా ఏలా పరిగణిస్తారేమోనని వివిధ శాఖల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు స్మార్ట్ ఫోన్లు లేని చిర ఉద్యోగులు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాప్ డౌన్‌లోడ్‌కు సంబంధించి ప్రక్రియ పూర్తయిన సమయంలో వారి ఫోన్లకు ఓటిపి రాకపోవడంతో చాలామంది బయోమెట్రిక్ ద్వారా మంగళవారం తొలిరోజు హాజరు నమోదు చేసుకోవడం కనిపించింది. దీనిపై ప్రభుత్వం ఆలోచించి తగు చర్యలు తీసుకోవాలని ముఖ హాజరు నుంచి విముక్తి పొందుతామంటున్నారు.

## విజయంలో ఉచిత పోలీస్ కానిస్టేబుల్ మాదిరి పరీక్షలు

**చిత్తూరురూరల్, జనవరి 19 ప్రభాతవార్త:**

ఈనెల 20, 21 తేదిలలో విజయం విద్యాసంస్థల ఆద్వర్యంలో నాయుడు బిల్డింగ్‌లోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలోపోలీస్‌కానిస్టేబుల్‌మాదిరిపరీక్షలు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల అధినేత డా.ఎం.తేజోమూర్తి తెలిపారు. ఈ పరీక్షలకు ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని, సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు పరీక్షలు వుంటుందనీ, పరీక్ష వ్రాయు అభ్యర్థులు ముందుగా తమ పేర్లను 08572- 230145, సెల్‌నెం. 6300808701 నంబర్ల ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు కోచింగ్ క్యాంప్

**చిత్తూరురూరల్, జనవరి 19 ప్రభాతవార్త:**

జనవరి 30 నుంచి ఫిబ్రవరి 4వ తేది వరకు మధ్యప్రదేశ్ జబల్‌పూర్ నందు ఖోలో ఇండియా ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు చిత్తూరు డిఎస్‌ఎ క్రీడామైదానంలో కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ క్యాంప్‌ను సందర్శించి క్రీడాకారులనుపరిచయంచేసుకొనిజాతీయస్థాయిలోగెలుపొంది,రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలనికోరారు. అలాగేక్రీడాకారులకుకోచ్‌గాకాకినాడకుచెందినపాపారావుపాల్గొంటారని పేర్కొన్నారు.

## పోలీసులకు సర్వీసును బట్టి పదోన్నతి కల్పించాలి

–టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చినబాబు



**వెదురుకుప్పం,జనవరి 19 ప్రభాతవార్త:**

రాష్ట్ర పోలీసు శాఖలో పనిచేస్తున్న పోలీసులకు వారి సర్వీసును పరిగణలోకి తీసుకుని పదోన్నతి కల్పించాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చినబాబు డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 60 వేల మంది పోలీస్ సిబ్బంది ఉద్యోగంలో చేరినప్పటి నుండి సర్వీస్‌తో నిమిత్తం లేకుండా, సకాలంలో పదోన్నతి రాక కానిస్టేబుల్‌గానే పదవీ విరమణ అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 20 సం॥లు సర్వీసు పూర్తయిన వారికి హెడ్ కానిస్టేబుల్‌గా, 5 సం॥లు పూర్తయిన వారికి ఏఎస్‌ఐలుగా, మరో 5 సం॥లు పూర్తయిన వారికి ఎస్‌ఐలుగా, అలాగే 6 సం॥లు పూర్తి చేసుకున్న ఎస్‌ఐలకు స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు కల్పించి సర్కిల్ ఇన్స్‌పెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. టిడిపి రైతు నాయకులు సురేష్‌బాబు, పాలడుగు మధు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

**చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త:**



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం ఆమోదముద్ర వేసింది. మున్సిపల్ కార్యాలయంలో మేయర్ అముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్, ఆర్ జి శ్రీకాంత్, బి.పూర్ణచంద్రరావు, సి.శోభ, ఎజి సహదేవన్‌లు సమావేశం అయ్యారు. ఈ సమావేశం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో23,24 డివిజన్లలో సిసి రోడ్ల నిర్మాణానికి అర్హత కల్గిన బిడ్డరుకు ఎల్ఓఎ జారీ చేయడానికి ఆమోదించింది. అలాగే 9వ డివిజన్‌లో రూ.40 లక్షల రూపాయలతో సిమెంటురోడ్డునిర్మాణానికిస్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. 50వ డివిజన్‌లో పవర్ బోర్ల మరమ్మత్తు సమయంలో మోటరు, పైపులను తీయడానికి లిఫ్టింగ్ వాహనం కొనుగోలు చేయడానికి కమిటీ ఆమోదం తెలిపింది. అలాగేవివిధపనులకుసంబంధించిఆమోదించారు. అసిస్టెంట్‌కమీషనర్‌గోవర్ధన్, ఎంహెచ్ఓడాక్టర్ లోకేష్, ఎంఇధనలక్ష్మీ, ఎసిపిరామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పక్కాగా రోడ్డు భద్రతా నియమాలు – ఎంవిఐ శివారెడ్డి

**గుడిపాల, జనవరి 19 ప్రభాతవార్త:**



ప్రతి వాహన చోదకుడు రోడ్డు భద్రతా నియమాలను పక్కాగా పాటించాలని ఎంవిఐ శివారెడ్డి అన్నారు. 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం ఎంవిఐ శివారెడ్డి మండలంలోని పలు చోట్ల ద్విచక్రవాహనదారులు, ఆటోడ్రైవర్లు, ఇతర వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంవిఐ శ్వేత, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం – ఆర్డీఓ డాక్టర్ రేణుక

**గుడిపాల, జనవరి 19 ప్రభాతవార్త:**

బాల్యవివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక పేర్కొన్నారు. మండలంలోని 13 గొల్లపల్లి గ్రామంలో గురువారం బాల్యవివాహాలపై ఆర్డీఓ డాక్టర్ రేణుక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. బాల్యంలోని వివాహం చేస్తే అమ్మాయిల్లో మానసిక, శారీరక ఎదుగుదల దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఆర్ఐ రమసాయి, సర్పంచ్ జనార్ధన్, ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచేందుకే లోకేష్ పాదయాత్ర

– తెలుగుయువత అధ్యక్షుడు మణి



**కుప్పం, జనవరి 19 ప్రభాతవార్త**

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, యువతకు అండగా నిలిచేందుకే తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కుప్పం నుంచి చేపడుతున్నట్లు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మణి పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో యువగళం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైకా పా పాలనలో యువతకు ఉద్యోగాలు రాకుండాపోయాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు అణచివేతకు గుర య్యారన్నారు. టిఎన్ఎస్ఎఫ్ నేతలు మాట్లాడుతూ కుప్పం నుంచి ఇచ్చాపురం దాకా నారా లోకేష్ పాద యాత్రలో పాల్గొంటామన్నారు. ఎమ్మెల్సీ దొరబాబు, తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నేతలు సత్యేంద్రశేఖర్, రాజ్‌కుమార్, శాంతారాం, ప్రతాప్, కాణిపాకం వెంకటేష్, సంతోష్, మురళి, మునెప్ప, సుబ్బు, రవి, విష్ణు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

– పలమనేరు ఎంవిఐ మధుసూధన్



**కుప్పం, జనవరి 19 ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు కృషి చేయాలని పలమనేరు ఎంవిఐ మధుసూధన్ సూచించారు. గురువారం స్థానిక మురుగన్ మహల్‌లో రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే డ్రైవర్లు మద్యంతాగివాహనాలునడపరాదన్నారు. ఎస్సైలు లక్ష్మిరెడ్డి, శివకుమార్, డ్రైవర్లు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికే గడపగడపకు – ఎమ్మెల్సీ భరత్

**శాంతిపురం, జనవరి 19 ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మీ ప్రభుత్వం కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. గురువారం 64పెద్దూరు పంచాయతీ సోమాపు రంలో గడపగడపకు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అర్హులైనప్రతిఒక్కరికీనవరత్నాలు పథకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామన్నారు. మూడేళ్ల పాలనలో సిఎం జగనన్న కుప్పంప్రజలకు1143కోట్లు వివిధ పథకాల రూపంలో అందించారన్నారు. గాంధీజీకలలుగన్న గ్రామస్వరాజ్యం సాధనలో భాగంగా సచివాలయ వ్యవస్థ అందుబాటులో తెచ్చి ప్రజల ముంగిటకే పాలన తెచ్చారన్నారు. ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, జడ్పీటిసి శ్రీనివాసులు, కన్వీనర్ దండపాణి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## తెలుగుయువత అధ్యక్షుడు సుబ్రమణ్యంచే అన్నదానం

**కుప్పంరూరల్, జనవరి 19 ప్రభాతవార్త**



శాంతిపురం మండల తెలుగుయువత అధ్యక్షుడు సుబ్రమణ్యంచే గురువారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా సుమారు ఐదువందల మందికితనకుమారుడుఅభయ్ తేజ్ జన్మదినం సందర్భంగా అన్నదానం చేపట్టారు. ఎమ్మెల్సీ దొరబాబు, తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నేతలు రాజ్‌కుమార్, డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, బిఎంకె రవిచంద్ర, మణి, పిఎస్ సతీష్, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్య పరిష్కారానికై తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**ఐరాల, జనవరి 19 ప్రభాతవార్త:**



తమ భూసమస్యను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు చూపుతున్న నిర్లక్ష్యానికి నిరసనగా కుటుంబంతో సహా తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన సంఘటన మండల కేంద్రం ఐరాలలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని 45 కొత్తపల్లెకు చెందిన నారాయణరెడ్డి సుమారు 5.18 ఎకరాల భూమిని 1992 సంవత్సరంలో వేరే వ్యక్తులు వద్ద నుండి కొనుగోలు చేశారు. అయితే భూయజమాని నారాయణరెడ్డి గత ఐదారేళ్ళ క్రితం మృతి చెందాడు. ఈభూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకంను రెవెన్యూ అధికారులు 1994 సంవత్సరంలో వేరే వ్యక్తుల పేరున మంజూరు చేశారు. దీనితో ఈభూమిపై వివాదం నెలకొంది. తమ పేరిట పట్టాదారు పాసుపుస్తకంను మంజూరు చేయాలని నారాయణరెడ్డి భార్య కళావతమ్మ రెవెన్యూ అధికారులకు పలు మార్లు వినతిపత్రాలు సమర్పించింది. అయితే సమస్య పరిష్కారం కాకపోవడంతో కళావతమ్మ కుటుంబసభ్యులతో కలసి గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం చేరుకుని ధర్నా నిర్వహించారు. పెట్రోల్ కూడా తీసుకునిరావడంతో గమనించిన పోలీసులు పెట్రోల్ సీసాను లాక్కున్నారు. అనంతరం స్థానిక తహశీల్దార్ సుశీల ఆందోళనకారుల వద్దకు వచ్చి ఆర్డీఓతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కళావతమ్మ కుటుంబసభ్యులు ధర్నా విరమించారు. ఈకార్యక్రమంలో బిజెపీ మండల అధ్యక్షుడు ఎం.కుమార్, కళావతమ్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సామాజిక వైద్యుడు యోగి వేమన



**చౌడేపల్లి, జనవరి 19 ప్రభాతవార్త**

యోగి వేమన సామాజిక వైద్యుడని తహశీల్దార్ మాధవరాజు అన్నారు. వేమన జయంతి సందర్భంగా స్థానిక మండల పరిపాలనా భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వేదాంత సారాన్ని పద్యాల రూపంలో అందించి అందరిలోనూ మేధాశక్తిని మేల్కొలిపినారన్నారు. ఆత్మ, కుల, ఆర్థిక సంస్కరణలను ఊరూరా బోధించి చైతన్యం తెచ్చారన్నారు. అనంతరం ఆయన పద్యాలను స్మరించుకొన్నారు. సింగిల్‌విండో ఛైర్మన్ రవిచంద్రారెడ్డి, ఎంపిడిఓ సుధాకర్, ఆర్ఐ సుధాకర్‌నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైయస్సార్ బీమా నగదు అందజేత

**పెద్దపంజాణి జనవరి 19 ప్రభాతవార్త :**



మండలంలోని కోగిలేరు పంచాయతీకి చెందిన పొట్టగానిపల్లి గ్రామంలో శోభారాణి (30)మృతి చెందగా వైయస్సార్ బీమా పథకంద్వారా అంత్రక్రియలకు పదివేల రూపాయలు నగదును వారి కుటుంబసభ్యులకు అందజేసినట్లు సర్పంచ్ రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గణపతి, సచివాలయ వెల్ఫేర్ అధికారి నజీర్‌బాషా, ఎంపిటిసి పరంధామ, వాలంటీర్ వినోద్‌తో పాటు వైకాపా నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా యోగివేమారెడ్డి విగ్రహావిష్కరణ

**పలమనేరు జనవరి 19 ప్రభాతవార్త :**

పలమనేరు పట్టణంలో యోగివేమారెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక పెట్రోల్‌బంకువద్ద నూతనంగా ఏర్పాటుచేసిన యోగావేమారెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ ఆవిష్కరించారు. ఈ మేరకు స్థానిక మార్కెట్‌కమిటీ ఆవరణంలో జరిగిన సమావేశంలో ఆయన, జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు(వాసు) మాట్లాడుతూ యోగివేమారెడ్డి రచనలతో ప్రజలను ఎంతోమెరుగైన మార్గంలో వెళ్ళేలా చేసారని, వేమన పద్యాలు, శతకాలు తెలియని తెలుగువారు లేరన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటి ఛైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పవిత్రమురళికృష్ణ, పెద్దపంజాణి మండల ఎంపిపి రెడ్డెప్ప చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు చెంగారెడ్డి, బాలాజి నాయుడు, జాఫర్ తధితరులు పాల్గొన్నారు.

## జనసైనికులపై పోలీసుల దాడి అమానుషం

– జిల్లా జనసేన అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్

**బంగారుపాళ్యం, జనవరి 19 ప్రభాతవార్త:**



మండలంలోని టేకుమందకు చెందిన జనసైనికులపై బంగారుపాళ్యం పోలీసులు దాడి చేయడం అమానుషమని జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్ పసుపులేని హరిప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ రోజు టేకుమంద గ్రామంలో సంప్రదాయ రీతిలో పశువుల పండుగ గ్రామస్తులు చేపట్టారని, ఈ పండుగలో ఎలాంటి పరుగు పందెలు నిర్వహించలేదన్నారు. ఆ సమయంలో పోలీసులు జనసైనికులపై లాఠీచార్జీ చేసి తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. చివరికి పోలీసులపైనే దౌర్జన్యంకు పూనుకొన్నారని తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. ఈ సమావేశంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కోడి చంద్రయ్య, జిల్లా కార్యదర్శి తులసీప్రసాద్, స్థానికనాయకులు ఆవుల శాంతమూర్తి, శివకుమార్, కిరణ్‌కుమార్, పవన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం ప్రజలకు దేవుడు చంద్రబాబు – ఎమ్మెల్సీ దొరబాబు

**కుప్పంరూరల్, జనవరి 19 ప్రభాతవార్త**



కుప్పం ప్రజలకు తెదేపా అధినేత చంద్రబాబునాయుడు దేవుడు అని ఎమ్మెల్సీ దొరబాబు, కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం కుప్పం తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుప్పంలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా నేతలే దొంగ ఓట్లతో గెలిచారన్నారు. కుప్పం రైతులపై వైకాపా నేతలకు ప్రేమ ఉంటే హంద్రీ–నీవా పనులు 28కోట్లతో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. చిత్తూరు చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని అమూల్‌కు కేటాయిస్తుండడం దారుణమన్నారు. ఈ సమావేశంలో నేతలు సత్యేంద్రశేఖర్, రాజ్‌కుమార్, శాంతారాం, ప్రతాప్, కాణిపాకం వెంకటేష్, సంతోష్, మురళి, మునెప్ప, సుబ్బు, రవి, విష్ణు, తెలుగుయువత అధ్యక్షుడు మణి పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఆర్థికసాయం

**శాంతిపురం, జనవరి 19 ప్రభాతవార్త** స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని మౌనిక రాష్ట్రస్థాయి రన్నింగ్ రేస్ పోటీల్లో పాల్గొంటున్న నేపథ్యంలో ఆమెకు కుప్పం లయన్స్‌క్లబ్ తరపున ఐదువేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డా॥ మహేష్, మాజీ ఎఎస్పై నవాబ్, లయన్స్‌క్లబ్ కోశాధికారి సెందిల్‌కుమార్, డైరెక్టర్లు శివ, మతీన్, శివ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

**వెంకటగిరి, జనవరి 19, ప్రభాతవార్త:**



మండలంలోని పెట్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో కోటేశ్వరరావు తనిఖీ చేశారు. 32 మంది విద్యార్థులకు గాను 30 మంది విద్యార్థులకు ఆధార్‌లో మార్పులు చేయడం జరిగిందని తెలిపారు. ఆధార్ కార్డులో సవరణలు చేసుకోవాలని సూచించారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు.

## మన్నారుపోలూరులో గడప గడపకు మన ప్రభుత్వం

**సూళ్లూరుపేట, జనవరి 19 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు గ్రామంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న పథకాలను లబ్ధిదారులకు ఇప్పటి వరకు అందిన లబ్ధి వివరాలు తెలియజేస్తూ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి బలపరచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులందరికీ ప్రభుత్వం ద్వారా అందాల్సిన పథకాలు తప్పకుండా అందుతాయని ఆయన పేర్కొన్నారు. అపోహలను, దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కృష్ణబలిజ సంఘం డైరెక్టర్ తుపాకుల ప్రసాద్, మాజీ చెంగాళమ్మ ట్రస్ట్‌బోర్డు సభ్యులు గోగుల తిరుపాల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## కొండూరు వద్ద రోడ్డుప్రమాదం – ఒకరికి తీవ్రగాయాలు

**తడ, జనవరి 19 ప్రభాతవార్త**



తడ మండలం కొండూరు వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ, కార్గో వాహనాలు ఢీకొనడంతో బీహార్‌కు చెందిన ఇంతియాజ్ ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం వల్ల జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. తడ పోలీసులు క్రేన్ సహాయంతో వాహనాలను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్గోలో ఉన్న ఇంతియాజ్ ఖాన్ ప్రాణాలను అతికష్టం మీద కాపాడగలిగారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు కూడా స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది.

## వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయానికి కృషి చేయాలి

– స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన



**·గూడూరు, జనవరి 19 ప్రభాతవార్త**

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ పిలుపునిచ్చారు. గురువారం గూడూరు మండలం చెన్నూరు, తిప్పవరప్పాడు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు దేవసేనమ్మను కలిశారు. గూడూరులో పొణకా దేవసేనమ్మతో పాటు వైసీపీ నేత పొణకా శివకుమార్‌రెడ్డిల నివాసాలకు వారు చేరుకొని పలు అంశాలపై చర్చించారు. అనంతరం దేవసేనమ్మను ఘనంగా సన్మానించారు. సంక్రాంతి సందర్భంగా నాయకులు తెచ్చిన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆమెను కలిసిన వారిలో ఎఎంసి డైరెక్టర్ దేగపూడి కృష్ణారెడ్డి, చెన్నూరు మాజీ సర్పంచ్ తోడేటి శివకుమార్, యాదవ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పద్దాల గోపాల్‌యాదవ్, దేగపూడివేణురెడ్డి, హరిరెడ్డి, జ్వాలామోహన్, గుర్రాలశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## నాయుడుపేటలో యోగివేమన జయంతి వేడుకలు

**నాయుడుపేట, జనవరి 19 ప్రభాతవార్త**

నాయుడుపేటలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా యోగి వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వేమన పద్యాలు తెలుగు సాహిత్యంలో విరబూసిన రత్నహారాలని, వేమన రాసిన పద్యాలు యువతకు ఎంతో స్ఫూర్తినిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దిన్, సిబ్బంది ఉన్నారు.

## క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తాం – ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి

**·గూడూరు, జనవరి 19 ప్రభాతవార్త**

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంను అభివృద్ధి చేసి క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి అన్నారు. గురువారం ఆయన గూడూరు పట్టణంలో పర్యటించారు. అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంను ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తితో పాటు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, కమిషనర్ సాయినాథ్‌లు పరిశీలించారు. స్టేడియంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో వారు పాల్గొని కాసేపు క్రికెట్ ఆడి అలరించారు. అనంతరం బహుమతులు ప్రదానోత్సవంలో ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తితో పాటు కమిషనర్ సాయినాథ్, ఆర్డీఓ కిరణ్‌కుమార్‌లు పాల్గొని క్రికెట్ టోర్నమెంట్ విజేత ఎలక్ట్రానిక్ మీడియా వారికి ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ తనతండ్రి బల్లి దుర్గాప్రసాదరావు ఎమ్మెల్యేగా ఉండగా 1986లో అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియం నిర్మించారని, నాడు జరిగిన అభివృద్ధి తప్ప ఇప్పటివరకు స్టేడియం అభివృద్ధి చెందలేదన్నారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ అధ్యక్షతన నూతన కమిటీ ఏర్పాటు చేసి స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే క్రీడాశాఖ మంత్రి ఆర్‌కె రోజాను కలిసి స్టేడియం అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు క్రీడాకారులకు అందిస్తామని తెలిపారు. బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటిసారి సంక్రాంతి పండుగ సందర్భంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి క్రీడలు ప్రతి సంవత్సరం నిర్వహించాలని కోరారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్సీ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, వైసీపీ గూడూరు టౌన్ ట్రెజరర్ సూరిశెట్టి హరికృష్ణ, వైసీపీ యువజన నాయకులు యోగి, గార వంశీ, మనోజ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ అసిస్టెంట్‌కు సన్మానం

**దొరవారిసత్రం, జనవరి 19 ప్రభాతవార్త**



దొరవారిసత్రం మండలం కల్లూరు సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ మునిశేఖర్‌ను గురువారం సూళ్లూరుపేట ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ కిరణ్‌కుమార్ సన్మానించారు. సచివాలయాల్లో అత్యధికంగా 4393 సేవలు అందించి తిరుపతి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిచిన డిజిటల్ అసిస్టెంట్ మునిశేఖర్‌ను అధికారుల బృందం, సిబ్బంది అభినందించారు. డిజిటల్ అసిస్టెంట్ మునిశేఖర్‌ను సహచర సిబ్బంది కూడా ఆదర్శంగా తీసుకొని ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. వీరితో పాటు దొరవారిసత్రం తహశీల్దార్ గోపీరెడ్డి, ఎంపిడిఓ శింగయ్య, ఆర్ఐ స్వర్ణలత ఉన్నారు

## వరిలో అగ్గి తెగులు నివారణ చర్యలు చేపట్టండి

– ఏడీఏ నాగార్జునసాగర్



**వెంకటగిరి, జనవరి 19, ప్రభాతవార్త:**

వరిలో అగ్గి తెగులు నివారణ చర్యలను చేపట్టాలని రైతులకు ఏడీఏ డాక్టర్ఎం.నాగార్జునసాగర్ సూచించారు. మండలంలోనివల్లివేడు గ్రామం లో వరిపైరును ఆయన పరిశీలించారు. వరిపైన అగ్గితెగులు గుర్తించి రైతులకు నివారణ చర్యలు చేపట్టా లని సూచించారు. రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకుని, ఈకేవైసీకూడా చేసుకోవాల నిసూచించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఏవో సుజాత, సిబ్బంది ఉన్నారు.

## యోగి వేమనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలి

– అదనపు కమాండెంట్ అరుణ్‌బోస్

**వెంకటగిరి, జనవరి 19, ప్రభాతవార్త:**



యోగివేమనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని 9వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ అదనపు కమాండెంట్ అరుణ్‌బోస్ తెలిపారు. యోగివేమన జయంతి సందర్భంగా 9వ ప్రత్యేక పోలీసు బెటాలియన్లు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యోగివేమన వేలాది పద్యాలను రచించి ప్రజలకు అంకితం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రమౌళి, డాక్టర్ శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు

**చిల్లకూరు జనవరి 19 ప్రభాతవార్త**



రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్య మం త్రి జగన్‌మోహన్‌రెడ్డి అని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. గురువారం నాయకు లతో కలిసి తమ్మినపట్టణం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పొందిన వారి ఇండ్లకు వెళ్లి పథకాలు అందాయాలేదా ! అని తెలుసుకున్నామన్నారు. అదే విధంగా కృష్ణపట్టణం పోర్టు యాజమాన్యం గతంలో తమ్మినపట్టణం గ్రామాం ఏర్పాటు చేసివున్న స్థలాన్ని కొనుగోలు చేశారని, వారు ఇప్పుడు ఖాళీ చేసి వెళ్లాలని వారు తెలిపారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈవిషయంపై పైస్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అదే విధంగా సుమారుగా వెయ్యి మత్స్యకార కుటుంబాలకు గత ప్రభుత్వం హయంలో ఆర్థికసాయం అందించే వారని, ప్రభుత్వం ఏర్పడి 3 సంవత్సరాలవుతున్నా మాకు ఎలాంటి ఆర్థిక సాయం అందలేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈకార్యక్రమంలో జడ్‌పిటిసి మన్నెం శ్రీనయ్య, ఎంపిడిఓ విష్ణు చిరంజీవి, తహసిల్దారు జి స్వర్ణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి, ఎంపిటిసిలు దారా కోటేశ్వరరావు, ఎల్లసిరి జానకిరామ్, సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం, ఏ.ఇ మునిరత్నం, పంచాయితీ కార్యదిర్శ గరుడయ్య, సచివాలయ సిబ్బంది, వాలింటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## భాష్యం స్కూల్‌లో ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు

**వెంకటగిరి, జనవరి 19, ప్రభాతవార్త:**



రాణిపేటలోని భాష్యం స్కూల్‌లో సహజకవి, ప్రజాకవిగా పేరుగాంచిన యోగివేమన జయంతి జరిగింది. ముందుగా వేమన చిత్రపటానికి పూలతో అలంకరించి పూజ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ యోగివేమన 1652 జనవరి 19న జన్మించినట్లు వేమన మీద పరిశోధన చేసిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ పరిశోధన ద్వారా తెలిసిందన్నారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్‌లో నూరు శతక పద్యాలు నేర్చిన విద్యార్థినీ విద్యార్థులు 20 మందికి నెల్లూరు జిల్లా పరిషత్ ఆఫీసులో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అన్నలూరు సుబ్బారావు సౌజన్యంతో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంకు ఉపయోగపడే మీ గమ్యం మీ చేతుల్లో అన్నపుస్తక ప్రసాదం కానుకగా అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, చామ్స్ ఇన్‌చార్జ్ సోహిని, శతక పద్యాలపై శిక్షణ అందించిన గురువు సుంకర రవికుమార్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సురేంద్ర, సువర్ణ, సుజాత, ప్రవల్లిక, గోపి, మురళీ ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేత



**బాలాయపల్లి, జనవరి 19, ప్రభాతవార్త:**

గరుడ ఫౌండేషన్ వారు నిర్వహించిన క్రికెట్ ఎపోటీల్లో విజేతలకు ప్రముఖ న్యాచరల్ వైద్యులు డాక్టర్ బొలిగల మస్తాన్‌యాదవ్ చేతుల మీదుగా కప్పు జయంపు జట్టు అందుకుంది. గరుడ ఫౌండేషన్ నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటుకు మొత్తం 32 జట్లు పాల్గొనగా సెమీఫైనల్‌కు రామాపురం, జయంపు జట్లు తలపడగా జయంపు జట్టు విజయం సాధించడం జరిగింది. ఫైనల్ పల్లిపాడులో జయంపు జట్టు తలపడగా జయంపు జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు డాక్టర్ మస్తాన్‌యాదవ్ చేతుల మీదుగా కప్పు అంద జేశారు. రన్నర్స్‌గా నిలిచిన పల్లెపాడు జట్టుకు పల్లెపాడు పంచాయతీ కార్యదర్శికందేరాజయ్య, మన్నూరుపంచాయతీకార్యదర్శి హేమంత్ కుమార్ చేతుల మీదుగా కప్పు అందజేశారు. ఈ కార్యక్రమంలో గరుడ ఫౌండేషన్ కో ఫౌండర్ గెరిటి చెంచయ్య యాదవ్, మారెళ్ల వెంకటాద్రి యాదవ్, తాళ్లూరి వెంకటరత్నయాదవ్, నారిబోయిన శ్రీనివాసులు, భూతు ప్రసన్నకుమార్, టోర్నమెంటు పల్లిపాడు యూత్ శివ, రఫి, పండు, అశోక్, కిషోర్, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే శిరస్త్రాణం ముఖ్యం

-జిల్లా రవాణా శాఖాధికారి సీతారామిరెడ్డి




తొట్టంబేడు, జనవరి 19 ప్రభాతవార్త : సునామీకంటే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలే ఎక్కువగా జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం (హెల్మెట్) ధరించి లాక్ వేసుకోవాలని తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి డి.సీతారామిరెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రతావారోత్సవాల్లో భాగంగా గురువారం చెన్నై-నాయుడుపేట బైపాస్‌రోడ్డులోని ఎస్ఎస్ కళ్యాణ మండపంలో శ్రీకాళహస్తి ఎంవిఐ కె.దామోదర నాయుడు ఆధ్వర్యంలో జాతీయరహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిధులుగా శ్రీకాళహస్తి డిఎస్పీ ధర్మవరపువిశ్వనాధం, ఆర్టీసి డిఎం విష్ణువర్ధన్‌రాజు, ట్రాఫిక్ సిఐ వెంకటప్ప, ఎన్‌హెచ్ఎఐ సూపర్‌వైజర్ రాథోడ్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి మాట్లాడుతూ రహదారి భద్రత-జీవితానికే రక్ష 'అమ్మ జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మనిస్తుందని' తెలిపారు. గత 25సంవత్సరాల నుంచి జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ద్విచక్రవాహనం, కారుని నడిపేటపుడు వాటి కండిషన్ ఏవిధంగా ఉందో చూసుకోవాల్సి ఉందన్నారు. ప్రతి ఒక్కరు లైసెన్సు, డాక్యుమెంట్లు కలిగి క్రమశిక్షణతో డ్రైవింగ్ చేయాలని, డ్రైవింగ్ చేసే వ్యక్తి కూడా తమ కుటుంబంను గుర్తుపెట్టుకుని వాహనాలను నడపాలన్నారు. డిఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్ మాట్లాడుతూ నేటి యువతలో సినిమాల ప్రభావం ఎక్కువగా ఉందని దీంతో యువత వాహనాలను అత్యధిక వేగంతో నడుపుతున్నారన్నారు. మన ప్రాణాలు మనచేతిల్లోనే ఉన్నాయని గుర్తించుకుని చెడు వ్యసనాలకు బానిసకాకుండా ఉండాలని హితవు పలికారు. ఎంవిఐ దామోదరనాయుడు మాట్లాడుతూ ఇకపై వాహనచోదకులకు లైసెన్సులు,సరైన రికార్డులు లేకుండా వాహనాలను నడిపితే జరిమానాతో పాటు జైలుశిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఎన్‌హెచ్ఎఐ సూపర్‌వైజర్‌రాథోడ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని దీని వల్ల పాఠశాల వదిలిన తర్వాత రోడ్లపై ఎలా నడవాలో నేర్పించడంతో వారు చైతన్యవంతులయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎన్‌హెచ్ఎఐ ఫ్లకార్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుచ్చినాయుడుకండ్రిగ సిఐ విక్రమ్, రూరల్ సిఐ అజయ్‌కుమార్, టుటౌన్ ఎస్ఐ మహేష్‌బాబు, పలు కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి 1.06 కోట్లు ఆదాయం



కాణిపాకం, జనవరి 19 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.06 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. గురువారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా కేవలం 15 రోజులకు గాను హుండీల ద్వారా 1,05,91,508 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 25 గ్రాముల బంగారు, 400 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 2,249 అమెరికా డాలర్లు, 110 యూఏఈ దినార్స్, 150 ఆస్ట్రేలియా డాలర్లు, 70 కెనడా డాలర్లు, 10 యూరో కరెన్సీ ఆదాయంగా వచ్చింది. ఈనెల 4న నిర్వహించిన హుండీ లెక్కింపు ద్వారా 16 రోజులకు 1,34 కోట్లు రూపాయలు ఆదాయంగా రాగా ప్రస్తుతం 15 రోజులకు 1.06 కోట్లు మాత్రమే రాగా హుండీ ఆదాయం గణనీయంగా తగ్గింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ, కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, హేమమాలిని, హరిమాధవరెడ్డి, సూపరెంటెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఉమేష్, యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లీకేజీలు అరికట్టండి... తాగు నీటిని ఆదా చేయండి



శ్రీకాళహస్తి,జనవరి 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపల్ ఇంజనీరింగ్ పనుల నిర్వహణ తీరు సర్వత్రా విమర్శలకు అవకాశం కల్గిస్తుంది. మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళే మార్గంలోని వివిఎంసి కూడలి నందు పెట్రోల్‌బంక్ సమీపంలో గత కొన్ని సంవత్సరాలుగా మంచినీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీలను అరికట్టడంలో ఇంజనీరింగ్ విభాగ నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే నిత్యం ఈ మార్గంలోనే పయనించే డిఇఇ,కమిషనర్ ఇతర ఇంజనీరింగ్ అధికారులకు కనబడటం లేదా? అని జనం చర్చించుకుంటు న్నారు. ఒకటి రెండు రోజులు,నెలలు కాదు సంవత్సరాలుగా ఒక లీకేజి అరికట్టలేని దుస్థితి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో చోటు చేసుకుంది. ప్రతి రోజూ లీకేజీల నుంచి వేల లీటర్ల నీరు ప్రక్కనే వున్న ఓ ప్రైవేటు పాఠశాల గ్రౌండ్‌లోని పోతున్నాయి. అయితే ఈ విషయాన్ని అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పంద కరవైందని అక్కడి ప్రజలు వాపోతున్నారు. రాబోవు వేసవి ఎద్దడి వున్న దృష్ట్యా ఇప్పటికైనా మున్సిపల్ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు స్పందించి ఈ లీకేజీని నిలువరించవలసినదిగా కోరుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ లీకేజీ ద్వారా మురుగునీరు తాగునీటి కొళాయిల్లోకి కలుస్తున్న దృష్ట్యా దీనిపై సత్వర నిర్ణయం తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అంటున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు మేల్కొని నీటి వృధాను అరికట్టాలని కోరుతున్నారు.

## మరమగ్గాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి




పుత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త : మరమగ్గాలకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు గురువారం స్థానిక విద్యుత్ శాఖ డిఇ ఆఫీసు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.ఎస్.పెరుమాళ్ మాట్లాడుతూ తమిళనాడులో మరమగ్గాలకు 750 యూనిట్లు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో కూడా కనీసం 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో పనులు లేక ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ ఛార్జీలు పెంచారని, గతంలో కూడా రకరకాల పేర్లతో ఛార్జీలు పెంచారని తెలిపారు. ఇప్పటికే మరమగ్గాల కార్మికులకు పనులు లేక తమిళనాడుకు వెళ్లి వాచ్‌మ్యాన్‌లుగా, హోటల్లో కూలి పనులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో నాయకులు సుబ్రమణ్య పిళ్ళై, ఎం.ఎం.షణ్ముగం, జగదీశ, పి.కె.వడివేలు, పాండియన్, వీరన్, మురుగన్, త్యాగరాజన్, ఆర్ముగం, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

## బర్డ్ ఆస్పత్రిలో అభివృద్ధికి ప్రణాళికలు :జెఇఓ సదాభార్గవి



తిరుపతినగరం,జనవరి 19ప్రభాతవార్త: శ్రీవేంకటేశ్వరస్వామిపై విశ్వాసంతో తిరుపతి బర్డ్ ఆస్పత్రికి వచ్చేరోగులకు మరింత మెరుగైన వసతులు, వైద్యం అందించేలా ఏర్పాట్లు చేయాలని టిటిడి జెఇఓ సదాభార్గవి అధికారులను ఆదేశించారు. బర్డ్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అందుతున్న సదుపాయాలు, వైద్యసేవలు, శస్త్రచికిత్సలను గురువారం జెఇఓ పరిశీలించారు. రోగులు వైద్యం అందుకునేందుకు ఇక్కడకు వస్తుంటారని, వారికి మెరుగైన వసతులు, వైద్యం అందించే దిశగా అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ రోగులకు అందిస్తున్న పాలు, అన్నప్రసాదం ఆమె ఆకస్మికంగా నాణ్యతను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నిరుపయోగంగా ఉన్న సామాగ్రిని డిపిడబ్ల్యు స్టోర్‌కు తరలించాలని ఆదేశించారు. తనిఖీల్లో బర్డ్ ఆస్పత్రి ప్రత్యేక అధికారి డాక్టర్ ఆర్.రెడ్డప్పరెడ్డి, అదనపు ఆరోగ్యఅధికారి డాక్టర్ సునీల్‌కుమార్,సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ కిశోర్ ,ఇఇ కృష్ణారెడ్డి ,డిఇ సరస్వతి పాల్గొన్నారు.

## 21న తై అమావాస్య పూజలు

శ్రీకాళహస్తి,జనవరి 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నెల నెలా ఓ ఉత్సవంలో భాగంగా ఈ నెల 21న తై అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆలయ కార్యనిర్వహణాధికారి వికె సాగర్‌బాబు శనివారం ఉదయం ఆలయం నుంచి స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా భరద్వాజ తీర్థంలోకి తీసుకెళ్ళనున్నట్లు వివరించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను అలంకార మండపంలో చక్కగా అలంకరించి ఏడాదిలో ఒక సారి మాత్రమే వెళ్ళే భరద్వాజ తీర్థంలో వెలసిన భరద్వాజేశ్వరుని ఆలయానికి పూజలకు తీసుకెళ్ళనున్నట్లు వివరించారు. భరద్వాజేశ్వరుని సన్నిధిలో స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను ప్రతిష్టించి విశేష అభిషేకాలు, నైవేద్యం, మంత్రపుష్పం, హారతులివ్వబడుతుందన్నారు. తదుపరి స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా ఆలయానికి చేర్చబడుతుందన్నారు.ఈ సందర్భంగా ఉదయం మూడు కాలాల్లో అభిషేకాలు, అర్జిత సేవలు దేవస్థానమే నిర్వహించబడుతుందన్నారు. అయితే రాహుకేతుదోష నివారణ పూజలు యథావిధిగా జరుగుతుందన్నారు.

## జగనన్న సచివాలయ ఓజిలి కన్వీనర్ ఇన్‌ఛార్జ్ నియామకం



ఓజిలి, జనవరి 19 ప్రభాతవార్త : జగనన్న సచివాలయం ఓజిలి మండల కన్వీనర్ ఇన్‌ఛార్జ్‌గా కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాషాను నియమించారు. వైసీపీ అధిష్టానం ఆదేశాల మేరకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య నియమించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పార్టీని గ్రామస్థాయిలో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. జగనన్న సచివాలయం ఓజిలి మండల కన్వీనర్ ఇన్‌ఛార్జ్‌గా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాషాను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రత్యేకంగా అభినందించారు. సచివాలయ మండల ఇన్‌ఛార్జ్ కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా ఎమ్మెల్యే సంజీవయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఓజిలి మండలంలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆయనకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

ఇండోర్ స్టేడియం పనులు మార్చి లోపల పూర్తి చేయండి

## ఏప్రిల్‌లో అందుబాటులోకి తీసుకురావాలి : మేయర్, కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 19 ప్రభాతవార్త : ఇండోర్ స్టేడియం పనులు మార్చి లోపల పూర్తి చేసి నగర ప్రజలకు ఏప్రిల్‌కి అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అధికారులను , ఏయికామ్ ప్రతినిధులు, కాంటాక్టర్‌ను ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని ఇందిరా మైదానం వద్ద నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులు గురువారం మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి జరుగుతున్న పనులు సమయుక్తంగా పరిశీలించారు. మార్చి లోపల పనులు పూర్తి చేసి, ఏప్రిల్ నెలలో నగర ప్రజలకి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ విధులతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులు మార్చి లోపల పూర్తి చేసి ఏప్రిల్ నెలలో నగర ప్రజలకి అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఈ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేకతతో నిర్మిస్తున్నామని తెలియజేసారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ స్టేడియంలో షటిల్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, జిమ్ ఏర్పాట్లు చేస్తున్నామని క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ డిఈ మోహన్, ఏయికామ్ ప్రతినిధులు బాలాజీ, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీల్లో రక్తహీనత నివారణకు చర్యలు : కలెక్టర్



చిత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త: గర్భిణీ స్త్రీల్లో రక్తహీనత నివారణకు పక్కాగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ హరినారాయణ్ డిఆర్ఓ రాజశేఖర్, ఐసిడిఎస్ పిడి నాగశైలజతో కలిసి సిడిపిఓలతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో ఎత్తు, బరువు తక్కువ గల పిల్లల ఆరోగ్య పరిస్థితులకు సంబంధించి పిడియాట్రీషన్ సూచనలతో వారి ఆరోగ్య పెరుగుదలకు సంబంధించి వారి తల్లులకు సూచనలు అందించాలన్నారు. డాక్టర్ల సూచనల మేరకు ప్రతి నెలా పిల్లల బరువు పెరిగేలా వారికి అవసరమైన పౌష్టికాహారం అదనంగా అందించడానికి కృషి చేయాలన్నారు. అలాగే సిడిపిఓలు వారి పరిధిలోని బరువు తక్కువ వున్న పిల్లలు, రక్తహీనత గల గర్భిణీల ఇంటికి వెళ్ళి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని వారికి అవసరమైన వైద్య సలహాలను ఎఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల సహాయంతో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బాల్య వివాహాలను కట్టడి చేయడానికి సచివాలయ స్థాయిలో మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓలు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచాలన్నారు.

**ఉగాదికి 24 వేల ఇళ్ళకు గృహప్రవేశాలు:**

జిల్లాలో ఉగాది నాటికి 24 వేల ఇళ్ళ గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ హరినారాయణన్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ హరినారాయణన్ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, హౌసింగ్ పిడి పద్మనాభంలతో కలిసి చిత్తూరు, నగరి, కుప్పం, పలమనేరు, పుంగనూరు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై మున్సిపల్ కమీషనర్లు, హౌసింగ్ డిఇలతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ళకు గృహప్రవేశాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా జిల్లాలో 24 వేల ఇళ్ళ గృహప్రవేశాలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించడంతో మున్సిపల్ కమీషనర్లు, హౌసింగ్ ఇంజనీర్లు వారి పరిధిలో లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ళ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించా లన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ళ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, కమ్మిలను సంబంధిత లేఅవుట్‌లో ఇళ్ళ నిర్మాణాలు చేపడుతున్న వారందరు కలిసి తీసుకోవడం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. అలాగే మెప్మా ద్వారా లబ్దిదారులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయడానికి మేస్త్రీలు, కూలీల కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఇళ్ళ నిర్మాణాల్లో పురోగతి కన్పించాలని, బిబిఎల్ నుండి బిఎల్‌కు, బిఎల్ నుండి ఆర్ఎల్‌కు, ఆర్ఎల్ నుండి ఆర్‌సికి, ఆర్‌సి నుండి ఇళ్ళు పూర్తి అయ్యే స్థాయికి వచ్చేలా చేయాలన్నారు. అలాగే ఇంకను ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించని లబ్దిదారులకు అవగాహన కల్పించి సత్వరం నిర్మాణాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమీషనర్లు, హౌసింగ్ ఇంజనీర్లు సమన్వయంతో విధులు నిర్వర్తించి ఇళ్ళ నిర్మాణాల లక్ష్యాల పూర్తికి నడుంబిగించాలన్నారు.

## నేడు న్యాయస్థానాల ఉద్యోగాలకు పరీక్షలు

-పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఉమ్మడి జిల్లా జడ్జి

తిరుపతిరూరల్, జనవరి19 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా హై కోర్టు విడుదల చేసిన 600 ఉద్యోగాల ఖాళీల నోటిఫికేషన్‌కు సంబంధించి న్యాయస్థానాలలో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాలకు ఈనెల 20న శుక్రవారం పరీక్షలు జరగనున్నాయని ఉమ్మడి జిల్లా జడ్జి ఇ. భీమారావు తెలిపారు. గురువారం పరీక్షా కేంద్రాలను జడ్జి పరిశీలించారు. చెర్లోపల్లి జూపార్క్ రోడ్డులోని అయాన్ డిజిటల్ కేంద్రంలో నిర్వహించే పరీక్షా కేంద్రాన్నిపరిశీలించారు. తిరుపతి జిల్లా పరిధిలో సెక్షన్ ఆఫీసర్, కంప్యూటర్ ఆఫరేటర్, టైపిస్ట్, కాపీస్ట్, డ్రైవర్ ఆఫీసు సబార్డినేటర్, అసిస్టెంట్ ఓవర్సీస్ వంటి ఉద్యోగాలకు ధరఖాస్తు చేసుకున్న 1168 అభ్యర్థులకు మూడు విడతలలో కంప్యూటర్ ఆథారిటీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెదటి సెషన్ ఉదయం 9గంటల నుండి 10:30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 12:30 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు, మూడో సెషన్ సాయంత్రం 4గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో అన్‌లైన్ పరీక్షల నేపథ్యంలో ఇంటర్ నెట్ కనెక్షన్ సౌకర్యం కల్పించాలని సంబంధిత పరీక్షా కేంద్రాల యాజమాన్యాలను ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా సమయానికి గంట ముందు హాజరుకావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పోలీసులను ఆదేశించారు, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వైద్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్స్, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, త్రాగునీటి వసతి కల్పించాలని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు క్యాంటిన్ అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. అభ్యర్థులకు హెల్ప్‌లైన్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో కంప్యూటర్ ఆథారిత పరీక్షలు జరిగే విధంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ జడ్జి కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కళ్యాణ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శిరీష, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, ఎంఆర్.పల్లి ఎస్ఐ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## బావిలో మృతదేహం

పాలసముద్రం, జనవరి 19 ప్రభాతవార్త: మండలంలోని ఎస్ఆర్ఆర్ కండ్రిగ పంచాయతీ సాయినగర్ గ్రామ సమీపంలోని ఓ బావిలో అదే గ్రామంకు చెందిన ఎం.ఉమాపతి(35) మృతదేహంను కనుగొన్నారు. నాలుగు రోజుల క్రితం బావిలో పడి మృతి చెందివుండటంతో మృతదేహం ఉబ్బుకొని వుంది. గురువారం బావిలో మృతదేహంను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని బావిలోని మృతదేహంను పైకి తీశారు. ఆపై మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంకు చెందిన పెద్దబ్బ కుమారుడు మద్యం సేవించి గత నాలుగు రోజుల క్రితం అదుపు తప్పి బావిలో పడి మృతి చెందినట్లు తెలిసింది. గత నాలుగు రోజులుగా ఉమాపతి కన్పించకపోవడంతో అతని కోసం కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికారు. అయితే బావిలో పడి మృతి చెందిన ఉమాపతి మృతదేహం గురుఉవారం బావిలో తేలియాడింది. ఈ మేరకు పాలసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య



పుత్తూరు, జనవరి 19 ప్రభాతవార్త : రైలు కింద పడి గుర్తు తెలియని ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో పట్టణంలోని మరాఠీ గేట్ - నందిమంగళం మధ్యలో రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడి వున్నట్లు గుర్తించామని, మృతునికి సుమారు 27 ఏళ్ల వయస్సు వుంటుందని తెలిపారు. నలుపు రంగు జీన్స్ ప్యాంట్, టీషర్ట్ వేసుకుని వున్నాడన్నారు. మృతదేహం తల, మొండెం కచ్చితంగా వేరైన దానిని బట్టి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తోందన్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## శాస్త్రోక్తంగా దక్షిణామూర్తిహోమం



తిరుపతి,జనవరి 19ప్రభాతవార్త: కపిలేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న హోమమహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం దక్షిణామూర్తి స్వామి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠ, దక్షిణామూర్తిహోమం, పూర్ణాహుతి, నివేదన, హారతి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఓ దేవేంద్రబాబు, టిటిడి ఛైర్మన్ సతీమణి స్వర్ణలతరెడ్డి, ఆలయ ఎఇఓ పార్థసారధి, అర్చకులు పాల్గొన్నారు.

## వాడవాడలో రెడ్డివారి చక్రపాణిరెడ్డి జన్మదిన వేడుకలు



నింద్ర, జనవరి 19 ప్రభాతవార్త : వాడవాడలో శ్రీశైలం ట్రస్టు బోర్డు ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య గురువారం ఘనంగా జరిగాయి. మండలంలోని చవరంబాకం గ్రామ సర్పంచ్ మనోహర్ నాయుడు, మేళంబాకం గ్రామ సర్పంచ్ బాలక్రిష్ణమరాజు, శ్రీరామాపురం సర్పంచ్ జయమ్మ, ఎలకాటూరు గ్రామ సర్పంచ్ ఆదిలక్ష్మి, జయచంద్రారెడ్డి, జియన్ కండ్రిగ గ్రామ సర్పంచ్ జయచంద్రారెడ్డి, ఇరుగువాయి సర్పంచ్ రాజేష్,నింద్ర గ్రామంలో తిరుమల,నేట్టేరి గ్రామ సర్పంచ్ మురళీనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. జన్మదిన వేడుకలు పురస్కరించుకొని గ్రామాలలో కేక్‌లు కట్ చేసి, అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు మల్లీశ్వరి పరంధామయాదవ్,యంపిటిసి విజయ్,తదితరులు పాల్గొన్నారు.

## మామిడిపూత ఆలస్యమైనా చింతవద్దు!

-విడిగిన పూతపై మందులు స్ప్రేచేయకూడదు :వ్యవసాయశాఖ ఎడిఎ భాస్కరయ్య

తిరుపతి,జనవరి 19ప్రభాతవార్త: ఫలరాజు మామిడిలోఈ ఏడాది పూత రావడంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, పూత రావడం కాస్తా ఆలస్యం అయినా రైతులకు చింతవద్దని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ మెరుగు భాస్కరయ్యతెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో జిల్లాలో 10శాతం చెట్లలోపూతవచ్చిందని, అయితే తుఫాన్ కారణంగా పూత పిందె కట్టకనే మగ్గిపోయింది. 70శాతం చెట్లలో ఇప్పటికీ పూతరాలేదని, ఈ స్థితిలో మామిడి రైతులు చేపట్టవలసిన చీడ నివారణ చర్యలపై అయోమయంలో ఉన్నారన్నారు.

**-లేతపూత దశలో చీడల నివారణ చర్యలు:**

మామిడి లేత పూత దశ,పూమొగ్గదశలో ఉన్నపుడుతేనె మంచు పురుగు,మిడ్జ్ పురుగు పూ మొగ్గలను తేనెగొంగళిపురుగు,పేను, బూడిదతెగులు ఆశించి నష్టపరుస్తాయన్నారు. మామిడి చెట్లలో పూత ప్రారంభదశలో ఉన్నపుడు చీడల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లీటరు నీటికి 0.5మిల్లీలీటర్లులేదా, థయోమిథాక్సాం లీటరునీటికి 0.3గ్రాములు, లేదా లాన్సర్‌గోల్డ్ లీటరు నీటికి2గ్రాముల మందులలో ఒకదానినినీటిలో కరిగే గంధకం లీటరు నీటికి 03గ్రాముల ,హెక్సాకొనాజోల్ లీటరు నీటికి2మిల్లీలీటర్లు మందుతో కలిపి చెట్లలోని పూమొగ్గలు బాగా తడిసేలా పిచికారి చేయాలన్నారు.

## సాయుధ దళానికి వార్షిక మోబలైజేషన్ ప్రారంభోత్సవం



తిరుపతి క్రైం, జనవరి 19 ప్రభాతవార్త : సాయుధ దళాల వార్షిక మొబలైజేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పోలీస్ ఏఆర్ పెరేడ్ మైదానంలో తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ పోలీస్ మైదానంలో 300 మంది సిబ్బందితో 15 రోజులు పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో శాంతి భద్రతను కాపాడేందుకు సివిల్ విభాగంలో పాటు ఏఆర్ విభాగం కూడా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. విభాగం కంటే కూడా అధికంగా విధులను నిర్వహిస్తూ పోలీస్ శాఖకు వెన్నెముక్కగా ఏఆర్ పోలీసు పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్, లక్ష్మి నారాయణ రెడ్డి, ఏఆర్‌డిఎస్‌పిలు, రాజేందర్ రెడ్డి, నందకిషోర్, ఆర్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, అప్ప రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తవణంపల్లెలో నూతన అధికార నందివాహనం ఊరేగింపు

తవణంపల్లె, జనవరి 19 ప్రభాతవార్త: మండల కేంద్రం తవణంపల్లెలో వెలసిన శ్రీకాళభైరేశ్వరస్వామి దేవస్థానంకు నూతనంగా తయారు చేయించిన అధికార నందివాహనంను గురువారం రాత్రి గ్రామంలో ఘనంగా ఊరేగించారు. శ్రీకాళభైరేశ్వరాలయంలో ప్రతి ఏటా శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు జరుగుతుంటాయి. ఈసందర్భంగా ఉభయదారులచే ఒక్కోరోజు ఒక్కో వాహనంపై స్వామివారిని ఊరేగిస్తుంటారు. ఈమేరకు స్వామివారు అధికార నందివాహనంపై ఊరేగేందుకు నూతన నందివాహనంను ఉభయదారులైన తవణంపల్లె గ్రామానికి చెందిన మొదలియార్ వంశస్థులు ప్రత్యేకంగా తయారు చేయించారు. ఈవాహనంను దేవస్థానంను గురువారం అప్పగించారు. ఈసందర్భంగా నూతన వాహనంను అలంకరించి ఉభయదారులు గురువారం రాత్రి మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయ అధికారులుకు అప్పగించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉత్సవ ఉభయదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బంగారుపాళ్యంలో దక్షిణ భారత వాలీబాల్ పోటీలు



బంగారుపాళ్యం, జనవరి 19 ప్రభాతవార్త: మండల కేంద్రం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నుండి 3 రోజుల పాటు దక్షిణ భారత వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు తులసీరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెన్నై బ్లిట్జ్ ఆధ్వర్యంలో రూపే ప్రైమ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారత దేశంలోని కేరళ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి ఆహ్వానిత క్రీడాకరులచే పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పురుషుల విభాగంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టు, కర్నాటక జట్టు, తమిళనాడు పోలీస్ జట్టు, మద్రాస్ యూనివర్సిటీ జట్టు పోటీ పడుతాయన్నారు. అలాగే మహిళా విభాగంలో కేరళ పోలీస్ జట్టు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టు, ఈరోడ్ జట్టు, భారతీయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు పోటీలో వుంటాయని వివరించారు. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. మాజీ జడ్పీ ఛైర్మన్, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కుమార్‌రాజా మాట్లాడుతూ వాలీబాల్ క్రీడకు బంగారుపాళ్యం పెట్టింది పేరని గుర్తు చేశారు. ఈ క్రీడా మైదానం నుండి అంతర్జాతీయ వాలీబాల్ జట్టుకు తులసీరెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, జయప్రకాష్, కుమార్‌నాయుడులు ఎంపికైన విషయం గుర్తు చేశారు. ఈ పోటీల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం జరిగే ఈ పోటీలను టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ప్రారంభిస్తారని, ఆదివారం ముగింపు కార్యక్రమంకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు రెడ్డప్ప, మిధున్‌రెడ్డిలు, ఎమ్మెల్యే ఎంఎస్ బాబులు హాజరు అవుతారని పేర్కొన్నారు. ఆసక్తి గల వాలీబాల్ క్రీడాకారుల ఈ పోటీలను తిలకించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా వాలీబాల్ కోచ్ సుదర్శన్‌నాయుడు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కోశాధికారి మురారి, బంగారుపాళ్యం సర్పంచ్ కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. చివరగా దక్షిణ భారత వాలీబాల్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.